## క్లుప్తంగా

### రైతులకు రాయితీ విత్తన కాయలు పంపిణీ

కలకడ : రైతులు రాయితీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. బుధవారం మండలంలోని కె.బాట వారిపల్లె రైతుభరోసా కేంద్రం పరిధిలోని రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీ అందించే వేరుశనగ విత్తన కాయలు మిల్లులకు తరలించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌భాస్కర్, బయన్న, ఏఈఓ, వీహెచ్‌ఏ, తదితరులు పాల్గొన్నారు.

### వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శిక్షణ

కలికిరి : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో ధర్మప్రసార అభ్యాస వర్గ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ధర్మప్రసార కన్వీనర్ ఏవీ ప్రసాద్, కో–కన్వీనర్ అంకాలయ్య గ్రామ సమితి సభ్యులకు హిందూ ధర్మ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి శ్రీనివాసనాయుడు, జిల్లా కార్యదర్శి చింతపర్తి మహేష్, ధర్మప్రసార బాధ్యత సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : మద్యం మత్తులో కాలువలో పడి మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. కుమారపురంకు చెందిన శేఖర్(30) మదనపల్లె మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మద్యం సేవించి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలోని శివాలయం సమీపంలో అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మురుగుకాలువలో పడ్డాడు. కాలువ లోతుగా ఉండటంతో శేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కలికిరి : రక్తదానం చేసి ప్రాణదాతలు కావచ్చని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మదనపల్లి జిల్లా ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. 23 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు గుర్తింపు పత్రం అందచేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధులు రెడ్డి బాషా, ప్రభాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### అతిసార నివారణపై అవగాహన



అతిసారపై అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ రమణ

తంబళ్లపల్లె: వేసవిలో అతిసార పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీహెచ్ఈఓ రమణ తెలిపారు. బుధవారం బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ అక్కిమ్మగారిపల్లెలో అతిసార నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిసార బారీనపడకుండా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లుపాల్గొన్నారు.

### సీమ సమగ్రాభివృద్ధికి ఉద్యమిద్దాం

గుర్రంకొండ : రాయలసీమ సమగ్ర అభివృద్ధి కోసం విద్యార్థులు, యువత ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని రాయలసీమ విద్యార్థి యువజన జేఏసీ కన్వీనర్ పాత్తూరి శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణంలో రాయలసీమ అభివృద్ధి కోసం విద్యార్థుల చేత సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం ఎగువ భద్రడ్యామ్ అక్రమంగా నిర్మిస్తుండడం వలన రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందన్నారు. సీమ అభివృద్ధి కోసం ప్రభుత్వం, వివిధ ప్రజా సంఘాల నాయకులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు

**పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లూరు గ్రామ పరిధిలోని గుండ్లూరు కస్బా, గుండ్లూరు హరిజనవాడ, గుండ్లూరు కాలని, నాయకునివారిపల్లి ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆదర్శవంతమైన పాలన కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న కాలని ఇండ్లు, తాగునీటి పైపులైన్‌లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ శుభ్రత, గుండ్లూరు కాలనిలో వెళుతున్న 33కెవి విద్యుత్ లైన్ మార్పు, సామాజిక పింఛన్లు, అభయహస్తం పింఛన్లు, ఆరోగ్యశ్రీ వర్తింపు, రెవెన్యూ సమస్యలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి పర్యటించిన ఎమ్మెల్యే గుండ్లూరులో శాశ్వత అంగవైకల్యం కలిగిన ముగ్గురు ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన వైద్య సదుపాయాల నిమిత్తం వైద్యశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. మెరుగైన వైద్య సదుపాయం పొంది కోలుకోవడానికి అవసరమైన మేరకు కార్పోరేట్ వైద్యానికి సిఫారస్సు చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందించారు. రూ.5వేల పింఛను మంజూరుకు జిల్లా డీఎంహెచ్ఓను కోరారు.

**చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం**

ఏళ్ళ తరబడి పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల రైతుల సమస్యలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో పరిష్కారం చేపట్టారని ఎమ్మెల్యే అన్నారు. గుండ్లూరులో చుక్కల భూముల రైతులకు సీఎం అందచేసిన ప్రత్యేక లేఖలను ఆయా రైతులకు అందజేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మైనార్టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎస్టీడి హరి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వాన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి సీఎం జగనన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం మండలాలకు చెందిన రైతులకు వాటర్‌షెడ్ పథకం ద్వారా రూ. 28కోట్ల విలువ చేసే వ్యవసాయ పరికరాలు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సీఎం ఆశయాల మేరకు అభివృధే ధ్యేయంగా పనిచేస్తున్నాని, వైఎస్సార్ కుటుంబంలో తానుకూడా ఓ కుటుంబ సభ్యుడిగా వ్యవహరిస్తానన్నారు. నియోజకవర్గానికి ఎన్ని నిధులు కావాలన్నా అడిగిన వెంటనే సీఎం విడుదల చేయడంతోనే అభివృద్ధి సాధ్యపడుతోందన్నారు. రాష్ట్రంలోనే వాటర్‌షెడ్ పథకం ద్వారా నియోజకవర్గానికి రూ.28 కోట్లు మంజూరు చేశారన్నారు. మొదటి విడతలో రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు దుక్కిదున్నడం నుంచి పంట నూర్పిడి వరకు అవసరమయ్యే అన్ని రకాల పరికరాలు 80 శాతం సబ్సిడీతో, ఎస్సీ, ఎస్టీలకు 90శాతం సబ్సిడీతో నాణ్యమైన పరికరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యవసాయరంగంలో రైతులు మరింత చొరవ చూపాలన్నారు. అనంతరం ఖరీఫ్ సాగుకు కావాల్సిన వేరుశనగ విత్తనకాయలను అగ్రికల్చర్ శాఖ ద్వారా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఖాజామైనుద్దీన్, ఇంజనీర్ యం. సురేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, ఐఎస్‌సిబి పీవో మేఘనాథం, వాటర్‌షెడ్ ఛైర్మన్‌లు, ఆర్‌బికె ఛైర్మన్ రెడ్డెమల్‌రెడ్డి, మల్లయ్యకొండ ఛైర్మన్ మల్‌రెడ్డి, ఎంపీడీవో ఆనంద్‌కుమార్, ఏవో రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు



పీసీపీఎన్‌డీటీ చట్టం పర్యవేక్షక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆస్పత్రులు, అల్ట్రాసౌండ్, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. బుధవారం సబ్ కలెక్టరేట్‌లో ఆర్డీఓ అధ్యక్షతన పి.సి.పి.ఎన్.డి.టి. యాక్ట్ అమలు, పర్యవేక్షణపై డివిజన్ స్థాయి సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో పోలీసు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ఎస్డీఓలు ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోయినా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. భ్రూణహత్యలు నివారించి ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత పోటీప్రపంచంలో మహిళలు, పురుషులు అనే వివక్ష ఉండకూడదని, పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని గుర్తించాలన్నారు. ఇప్పటికీ ఆడపిల్ల పుడుతోందని తెలిస్తే..వారిని తల్లి గర్భంలోనే హతమారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీసీపీఎన్‌డీటీ, సరోగసీ చట్టాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని తెలిపేలా అన్ని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో పోస్టర్లు ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రజల్లో ఈ విషయంపై అవగాహన పెంచేలా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ కేశప్ప, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మి, ఐసీడీయస్ సీడీపీఓ సుజాత, సీఐలు మహబూబ్‌బాషా, సత్యనారాయణ, శివాంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

### కలకడ తహసీల్దార్‌గా ప్రదీప్

కలకడ : మండల తహసీల్దార్‌గా కె.ప్రదీప్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రాము పెద్దమండ్యంకు బదిలీ అయ్యారు. పీలేరులో విధులు నిర్వహిస్తున్న కె.ప్రదీప్ కలకడకు బదిలీపై వచ్చారు. చేశారు. బదిలీపై కలకడ లో బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న జి.రామును కార్యాలయ సిబ్బంది, వీఆర్ఓలు సన్మానించారు.

### పీవీఎస్ లక్ష్మికి ప్రశంసాపత్రం

పీలేరు రూరల్ : పీలేరు షీ సంస్థ అధ్యక్షురాలు, యోగా సంస్థ నిర్వాహకురాలు పి.వి.ఎస్. లక్ష్మికి జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు. షీ దివ్య యోగ విద్యాలయం, ఏపీ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో సమ్మర్ యోగ క్యాంప్ ముగింపు సమావేశం రాయచోటి కలెక్టరేట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తూ ప్రశంసా పత్రంతో సత్కరించారు. సమాజానికి ఉపయోగపడేలా యోగ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

### ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి కలశారాధన

రామసముద్రం : రామసముద్రం మండలం కుదురుచీమనపల్లె పంచాయతీ మిట్టయంబాడిలో నూతనంగా నిర్మించిన శ్రీరుక్మిణి సమేత గోపాల స్వామి ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా బుధవారం ఘనంగా కలశారాధన నిర్వహించారు. ఉదయం వేదపండితులచే వేదమంత్రోత్సరణలతో భగవత్ ప్రార్థన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యస్నపనం, మృత్తికాస్నపనం, అగ్నిప్రతిష్ఠ, మూర్తి హోమం, సకృత్పుర్ణాహుతి, దాన్యాదివాసం నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం మూర్తిహోమం, జీవాదతత్వన్యాస హోమం, షోడశ న్యాసహోమం, సకృత్పూర్ణాహుతి, శయ్యాదివాసం, పుష్పాదివాసం చేశారు. అలాగే 8వ తేదీ గణపతిపూజ, పుణ్యాహవాచనం, కళశారాధన, ప్రాణాధి దశ వాయున్యాసహోమం, ప్రాణప్రతిష్టహోమం, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, కళ్యాణోత్సవం, తీర్థ ప్రసాద వినియోగము జరుగుతుందన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహులు చిన్నప్పరెడ్డి పేర్కొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి

పీలేరు : మండలంలోని జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4951 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 1221 ఇళ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. 1166 ఇళ్లు మోల్డింగ్, 498 ఇళ్లు గోడలు, 2388 గుంతాతాలు పూర్తి చేశారని చెప్పారు. ఇంకా ప్రారంభం కాని 628 ఇళ్ల నిర్మాణాలు తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. హౌసింగ్ లబ్ధిదారులకు రూ.35 వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా సత్వరం అందజేయాలన్నారు. ఉపాధి బిల్లులు తక్షణం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మిరెడ్డి, ఏపీవో చెన్నకేశవులు, ఈవో ప్రసాద్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ బాలాజీనాయక్, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, జ్ఞానశేఖర్, అయ్యప్ప, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన ‘ధుర్యోదన వధ’ నాటకం



ధుర్యోదన వధ నాటకంలో ఆకట్టుకున్న సన్నివేశ దృశ్యం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు బుధవారం ధుర్యోధన వధ నాటకంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, తదుపరి భాగవతారిణి స్వర్ణలత హరికథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న ధుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహూతులను అలరించింది. మైదానంలో ఏర్పాటు చేసిన ధుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టిపడేసింది. అర్జునుడు తపస్మాన్ అధిరోహించడం ఘట్టంతో మహాభారత ఘట్టం ముగిసింది. కళాకారులు హరిప్రసాద్, నవీన్,రోషన్ చేసిన నాటకప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్, రామచంద్రనాయుడు,శ్రీధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరురూరల్ : సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం శ్రీనాథరెడ్డి తనయుడు, యువ పారిశ్రామిక వేత్త రాకేష్‌రెడ్డి ప్రజలతో పరిచయ కార్యక్రమం రెండవ రోజు నిర్వహించారు. పీలేరు పట్టణం 1వ వార్డు పరిధిలో యల్లమంద క్రాస్‌లో ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగేళ్లలో 98 శాతం పైగా నెరవేర్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, నాయకులు షఫీ, హుమయూన్, ఉదయ్‌కుమార్, బాలం నరేంద్రరెడ్డి, ఆనంద్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, నాగభూషణం, షౌకీర్, ఉమాకాంత్‌రెడ్డి, మునీర్, కృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, సాయి, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజ, అబిద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 135 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక

వాల్మీకిపురం : శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 135 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 35 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ మౌనిక తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీలభాస్కర్, మదనమోహన్ రెడ్డి, శంకరాచారి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, సిబ్బంది గౌరీ శంకర్, మధుమిత, మురిగేషన్, కృష్ణవేణి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : బడిఈడు పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలని కార్మికశాఖ అధికారి ఆనందబాబు అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్టలో వివిధ దుకాణాలకు వద్దకు వెళ్లి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. చదువుకునే వయస్సులో పిల్లలు బడిలో మాత్రమే ఉండాలన్నారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శాంత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

**బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై అవగాహన**

మదనపల్లెల సిటీ : ఫోర్డు, క్రై సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచే 12 వరకు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మదనపల్లె, పెద్దమండ్యం మండలాల్లో గ్రామ, కాలనీల్లో ర్యాలీలు, చిత్రలేఖన పోటీలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల కార్మికులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత గురించి వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీధర్, నరసింహులు, రాధమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### సర్కార్ స్కూళ్లకు జేవీకే కిట్‌ల తరలింపు

ములకలచెరువు : మండల కేంద్రంలో నిల్వ ఉంచిన జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం ఆయా ప్రభుత్వ స్కూళ్లకు వాహనాల్లో తరలించారు. మండలంలోని 63 ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఈ కిట్లను అందజేస్తున్నట్లు ఎంఈఓ వెంకట్రమణ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు హరి, పణి, రవి, లక్ష్మినారాయణ, లక్ష్మీపతి, ప్రసాద్ పాల్గొన్నారు.

### ఖాజీ పదవీ కాలం పొడిగింపు

ములకలచెరువు : ములకలచెరువు మండల ప్రభుత్వ ఖాజీగా కదిరి రోడ్డుకు చెందిన మౌల్వీ పఠాన్ ఇలియాజ్ ఖాన్ కొనసాగుతున్నారు. ఈయన పదవీ కాలాన్ని మరో పదేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని ఖాజీ కలసి కృతజ్ఞతలు తెలిపారు.

### 11న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

తంబళ్లపల్లె : 2023–24 విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు పొందుపరిచినట్లు తెలిపారు.

### బహుమతులు అందజేత

కలకడ : గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన వారికి బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు గ్రంథాలయశాఖ అధికారి అమరనాథ్ తెలిపారు. క్యారమ్ బోర్డ్, చెస్, టెన్నికాయిడ్ పోటీలలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినవారికి బహుమతులు అందజేశారు.

# మద్యం షాపుల సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు



మద్యం షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

పీలేరు : మద్యం షాపుల సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు చేయరాదని చిత్తూరు మద్యం డిపో ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు చేశారని, తీరా తాము పూర్తి స్థాయిలో విచారణ జరపగా తప్పుడు ఫిర్యాదులు అని తేలాయని పేర్కొన్నారు. సిబ్బంది తమపై ఫిర్యాదులు రాకుండా మద్యం ప్రియులపై మర్యాదగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో తనిఖీ అధికారులు నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# విత్తనకాయల్ని సద్వినియోగం చేసుకోవాలి



విత్తనకాయలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గుర్రంకొండ : సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఏఈఓ అనిత అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండ ఆర్బీకేలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేరుశనగ రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై విత్తనకాయల్ని సరఫరా చేసిందన్నారు. రైతులకు అవసరమైన మేరకు విత్తన కాయలు ఇస్తారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ సురేష్, వీఆర్వో రెడ్డిశేఖర్, పంచాయతీ కార్యదర్శి కల్యాణి, ఎంపీఈవో మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

**సజావుగా విత్తన కాయల పంపిణీ**

పెద్దతిప్పసముద్రం : ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఆర్బీకేల వద్ద రాయితీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని రంగసముద్రంలో ఏవో ప్రేమలత, గ్రామ వ్యవసాయ అధికారి సురేంద్ర, ఉప సర్పంచ్ బొక్కసం శివ, వైఎస్సార్ సీపీ నాయకులు రవిశంకర్, సుబ్రమణ్యం, రామిరెడ్డిల సమక్షంలో విత్తన కాయలను పంపిణీ చేశారు.

# ఇచ్చిన మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి

కలకడ : ప్రభుత్వ వైద్యశాఖలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిన అన్ని రాజకీయ పార్టీలు కాంట్రాక్ట్ వ్యవస్థకు మాత్రం న్యాయం చేయలేదు. దీంతో 22 సంవత్సరాలుగా ఆవేదనతో ఉన్నవారికి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేసేలా నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని చిత్తూరు జిల్లా వైఎస్సార్ టీయూసి మెడికల్‌అండ్‌హెల్త్ అధ్యక్షులు సి.సురేంద్రరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సింగర.వెంకట్రమణ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం జీఓ. 27ను తీసుకువచ్చి కాంట్రాక్ట్ ఉద్యోగుల గొంతు కోసినట్లు చేసిందని పేర్కొన్నారు. నేటి ప్రభుత్వం బుధవారం కేబినెట్ ఆమోదంతో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించిందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలు ఎప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీవితకాలం రుణపడి ఉండే నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.